# పియాకోఘుర్

నడుస్తున్నాను, కాళ్ళు కాయలు కాచి పోయేలా మహానగర్‌లోని వీధులన్నీ తిరుగుతున్నాను. అయినా నా అన్వేషణ ఫలించలేదు.

నేనేమీ బాల్కనీలు, ఎటాచ్డ్ బాత్‌లూ కోరుకోవటంలేదు. భార్యా, ముగ్గురు పిల్లలతో గుట్టుగా కాపరం చెయ్యటానికి సరిపడే రెండుగదుల అద్దె కొంప దొరికితే చాలు నాకు. ఈ తిరువళ్ళిక్కేణిలో నూటయాభై రూపాయలకు తక్కువలో నా కోరిక నెరవేరడం అసంభవమని తేల్చిపారేశారు బ్రోకర్లు. నా జీతంలో మూడోవంతు గూటికే ధారపోస్తే ఏం తిని బతకాలి ఈ మహాపట్నంలో? వెధవది యాభై రూపాయల ఇంక్రిమెంటుకు కక్కుర్తిపడి సొంతవూరు, సరిపడ్డ కొంప వొదులుకొని ఈ నగరంలో కొచ్చి పడ్డాను. "ఇల్లు కుదిరిందా? ఎప్పుడు బయలుదేరి రమ్మంటారు? అంటూ రెండురోజులకో ఉత్తరం రాస్తూవుంది శ్రీమతి.

తిరిగి తిరిగి అలసిపోయిన పాదాలు మెరీనా బీచికేసి దారితీసాయి. "మెరీనా బహారీ" లోంచి జూక్‌బాక్సు సంగీతం వినసొంపుగా వుంది. లోపలి కడుగు పెట్టాను. దాదాపు అన్ని కుర్చీలు నిండి వున్నాయి ఓ మూలగావున్న టేబిల్ దగ్గర మాత్రం రెండు కుర్చీల్లో ఒకటి ఖాళీగా కనిపిస్తే వెళ్ళి కూర్చున్నాను. నన్నడక్కుండా నా చేతిలోని తెలుగు పత్రికను అందుకున్నప్పుడు చూశాను నాకెదురుగా కూర్చున్న అతణ్ణి. అతనికి బాగా పెరిగిన గడ్డముంది. చేతిలో వెలిగే చార్మినార్ సిగరెట్టుంది. కళ్ళ క్రింద ముప్పైదాటిం తరువాత ఏర్పడే నల్లటి గీతలున్నాయి. పత్రిక పేజీలు తిరగేస్తున్నాడు అతను. వాట్లోని అందమైన బెల్‌బాటమ్సునీ, మినీస్కర్ట్‌లనీ తిలకిస్తున్నాను నేను.

"మీకు పెళ్ళయిందా?"

ఉలిక్కిపడి చూపులు మరల్చిన నాకేసి నవ్వుతూ చూస్తున్నాడు అతను.

"అయింది" ఎందుకు చెప్పాలి అనుకుంటూనే అనేశాను.

పెళ్ళికిముందు నేను కూడా మీలాగే ఇక్కడికి వచ్చే కలర్స్‌ని చూస్తూ కూర్చునేవాణ్ణి. తరువాత ఆ అలవాటు

---

జి. సి. జీవి

---

మానుకున్నాను ఎందుకో తెలుసా?" అని అగేడు అతను.

"చెప్పండి" అన్నాను చిన్నగా నవ్వటానికి ప్రయత్నిస్తూ.

బేరర్ టీ కప్పు తెచ్చి అతని ముందుంచుతూ నాకేసి చూసి చిన్నగా నవ్వేడు. చిప్సు ఆర్డరిచ్చేను.

ఒకసారి టీ సిప్‌చేసి సిగరెట్టుపొగ వదిలి చెప్పటం ప్రారంభించేడు అతను.


"చెబితే నమ్మరేమోగాని మా ఆవిడ ఈ నగరంలోని అందరాడాళ్ళ కంటే కూడా చాలా అందగా వుంటుంది. పెళ్ళయిన కొత్తలో ఓసారి ఈ హోటల్‌కి తీసుకొచ్చాను. ఇక్కడున్నంత సేపూ అందరి కళ్ళూ మా ఆవిడ మీదే.

"ఛీ! ఛీ! ఏమిటండీ ఈ వూళ్ళో మనుషులు కొత్తగా ఆడదాని మొహమే ఎరగనట్టు అంతా అలా నన్నే చూస్తారేం వింతగా! నాకు చచ్చేంత సిగ్గేస్తోంది బాబూ." ఆ తరువాత మళ్ళా ఆవిడ ఇటువేపు రాలేదు.

"అందరూ తనని వింతగా చూట్టం, దీనికితోడు సినిమాల్లో చేరమంటూ సినిమావాళ్ళు వెంటపడటం ఈ సంఘటనల తరువాత మా ఆవిడ ఓరకమైన కాంప్లెక్సుకు గురైంది. ఎప్పుడో ఎవరో రకమైన తనని నానుండి విడదీస్తారేమోననే అనుమానం పెరిగి పెరిగి మనుషుల మధ్యకి రావటమే మానుకుంది. అంతెందుకు మా బంగళా చుట్టూ అందమైన తోట పెంచాను. ఆవిడ కిష్టమైన రకరకాల పూలమొక్కలెన్నో తెప్పించి నాటాను. కానీ కనీసం తోటలోకి కూడా రావటం మానుకుంది ..." అతను చెప్పుకుపోతున్నాడు. నాదో ఓ కోరిక. ఆమెని...ఆ సౌందర్యరాశిని ఒక్కసారి చూడాలని! కాని ఎలా వెల్లడించను? ఆశ్చర్యం! నాలో కదిలే కోరికని ఎలా పసిగట్టేడో అతను? లేక కేవలం యాదృచ్ఛికమా?

"మా బంగళాకు వస్తారా రేపు?" ఆహ్వానించేడు. ఎగిరి గంతేసి బుహారీ నుంచి మెరీనా మీదుగా సముద్రంపై కెగిరి విహరించింది నా మనస్సు. ముచ్చటయిన బంగళా... చుట్టూ చక్కని పూలతోట... మేడమీది గదిలో హంసతూలికాతల్పం మీద వయ్యారంగా పవ్వళించియున్న అపురూప లావణ్యవతి, నా కళ్ళముందు మెదుల్తోంది. అంతేకాదు. సొంత భవనం, చుట్టూ పూ‌వనం కలిగి వున్న అతను నాకో రెండు గదులు అద్దె కొంప కుదిర్చి పెట్టలేడా అనే ఆలోచన నాకు మరింత హుషారిచ్చింది.

మరుసటిరోజు సాయంకాలం ఆరున్నరకి అదే టేబిల్ దగ్గరున్న కుర్చీలో కూర్చున్నాను. మాకోసం అన్నట్టుగా ఆ రెండు కుర్చీలు ఖాళీగా వున్నాయ్. అతనింకా రాలేదు. కప్పు మీదకప్పు సిప్‌చేస్తూ అతనికోసం ఎదురు



చూస్తున్నాను. ఏడున్నర, ఎనిమిది, ఎనిమిదిన్నర కూడా దాటింది. హోటల్లో జనం పల్చబడుతున్నారు కుర్చీలు ఖాళీ అవుతున్నాయ్. హడావిడి తగ్గి బేరర్లు తీరిగ్గా మాట్లాడుకుంటున్నారు.

అతనిక రాడేమో !


బేరర్‌ని పిలిచాను. నాకేసి అదోలా చూసి నవ్వుతూ వచ్చాడు బేరర్. అడిగాను అతన్ని గురించి.

"ఇవాళ అతను మిమ్మల్ని ఇంటికి ఆహ్వానించాడా సార్?"

ఆశ్చర్యపోతూ తలూపాను.


"అయితే ఇవాళ్టికి అతను రాడు. మరో వారం రోజుల్దాకా మీ క్కని పించడు." వివరంగా చెప్పమన్నాను. నాకు దగ్గరగా ఒకస్టూల్ లాక్కుని కూర్చున్నాడు బేరర్.

"అతన్ని గురించి తెలిసిన వాళ్ళెవ్వరూ అసలిక్కడ కూర్చోరు సార్. అందుకే ఈ మూల ఒక కుర్చీ ఎప్పుడూ ఖాళీగా వుంటుంది. మా తమ్ముడూ, ఇతనూ ఒకే ప్రెస్సులో పనిచేస్తున్నారండీ..." చెప్పసాగాడు బేరర్. "మేడమీద ప్రెస్సు. కింద గోడౌన్లు. వాటి కెదురుగా చీకటి గుయ్యారాల్లాంటి కొన్ని గదులు. కొట్టులాంటి ఒకగదిలో అతని నివాసం. అతని జీతంలో పాతిక రూపాయల గది అద్దెపోగా మిగిలేది వందరూపాయలు. చాలాకాలందాకా అతనికి వివాహం కాక పోవటానికి కారణం ఆ చీకటికొట్టు,దాని చుట్టూ పరిసరాలు. అతనిలో పట్టుదల పెరిగింది. ఓ చక్కని చుక్కను పెళ్ళాడి ఆ గదిలోనే కాపురం పెడతానని



సవాల్ చేశాడు. మారుమూల ఏదో పల్లెటూరునించి ఓ చక్కని చిన్నదాన్ని పెళ్ళాడి తెచ్చుకున్నాడు. పట్నంలో అబ్బాయికి అచ్చాఫీసులో నూటపాతిక రూపాయల వుద్యోగం. ఆ ఒక్క అర్హతకే మురిసిపోయి పిల్లనిచ్చారు ఆ నిరుపేదలు. వినేవాళ్ళుదొరికితే తన భార్యను గురించి ఎన్నో చెబుతాడు. కాని ఒక్కటి మాత్రం నిజం. ఆ అమ్మాయి చాలా అందంగా వుంటుంది సార్.

"మొదటి నెలరోజులు బాగానే గడిచింది. భార్యను వెంట పెట్టుకుని పట్నం అంతా తిప్పాడు. ఆ తరువాతే అసలు గొడవ ప్రారంభమైంది. ఆ అమ్మాయి తన పరిసరాలను గుర్తించటం ప్రారంభించింది. మేడమీద ఎప్పుడూ తిరిగే ప్రెస్సు చక్రాలమోత. దానికితోడు ఆ వీధిలోని ఆటోమొబైల్ వర్కుషాపుల కర్ణకఠోరమైన శబ్దాలు, గాలీ వెలుతురుకోసం వున్న ఆ ఒక్క కిటికీ తెరిస్తే ఎదురుగ్గా 'డే అండ్‌నైట్' టీ స్టాలు, అక్కడ టీ సేవిస్తూ వెకిలిగా నవ్వులూ, వెధవ చూపులూ చూసే మనుషులు. ప్రకృతి ఒడిలో పచ్చని వరిచేల మీదుగా విహరించే స్వేచ్ఛా విహంగాన్ని తెచ్చి ఊపిరాడని చీకటి గూటిలో బంధించినట్లుంది ఆమె పరిస్థితి. ఒకసారి పండక్కి పుట్టింటికి వెళ్ళి ఆమె మళ్ళా తిరిగి రాలేదు. బతిమాలి, బలవంతంచేసి తీసుకొచ్చాడు. గది మార్చమని ఎంతగావో చెప్పిచూసింది.




ఆ పరిసరాలు తనని పిచ్చెత్తేలా చేస్తున్నాయని మొత్తుకుంది. అతను వల్లకాదన్నాడు. ప్రెస్సుకి దగ్గర్లో పాతికరూపాయలకి మరోదది దొరకదు అతనికి. ఓసారి అతనికి తెలియకుండా పుట్టింటికి వెళ్ళిపోయింది ఆమె మళ్ళా అతనే వెళ్ళి తిట్టి, కొట్టి తెచ్చుకున్నాడు. అప్పట్నుంచి అతనికో భయం పట్టుకుంది తనని విడిచి మళ్ళా ఎక్కడికి ఆమె ఎగిరిపోతుందో నని డ్యూటీకి వెళ్ళేటప్పుడు ఆమెని గదిలో బంధించి తాళం వేసుకుని వెళ్ళటం మొదలెట్టాడు. ఆమె అతనితో మాట్లాడటం మానేసింది. ఇలా ఎంతోకాలం సాగలేదు.

ఒక రోజు రాత్రి ప్రెస్సు నుంచి తిరిగొచ్చి తాళం తీసి గదితలుపులు తెరిచాడు చూరునించి వేలాడుతున్న భార్యశవం కనిపించింది."

చెప్పటం ముగించాడు బేరర్.
బిల్లు చెల్లించి బయటకొచ్చాను.
సముద్రంమీంచి వీచే చల్లని గాలి.
వేడెక్కిన నా మెదడుకి వుపశమనం కలిగించటంలేదు.
నా కళ్ళ ముందు......

నగరంలోని ఎత్తైన భవనాలు, విశాలమైన వీధులు, ఖరీదైన బంగళాలు— వీటికి ఆవల ఒకానొక ఇరుకు సందు, ఆ సందులో ఓ చీకటి గూడు, ఆ గూడు చూరుకు వేలాడుతూ ఊపిరాడక గిలగిల కొట్టుకుని రెక్కలు వాల్చేసిన పావురం గిరిగిరా తిరుగుతోంది.